# బాలమిత్ర

డిశంబర్ - 1995



Rs. 5



# బ్రహ్మజ్ఞానము

టాండీ అనే గ్రామంలో రామశర్మ అనే ధనికుడు ఉన్నాడు. అతనిలో ఓ తీరని కోరిక ఉంది. ఆ కోరిక ఎలా తీరగలదని మిత్రుడిని అడిగాడు.

''రామశర్మా! నీ సమస్య తీర్చగలవారు షిర్డీలో వున్నారు. వెళ్ళి కలవండి'' అంటూ సలహా యిచ్చాడు. ఆ మర్నాడే రామశర్మ షిర్డీకి చేరి సాయిరామ్‌ని కలిసాడు. సాయినాథుని చూసి నమస్కరించాడు.

''ఏం కావాలి నాయనా?'' అని బాబా అడిగారు.

''నాకు సుఖ సంపదలకు, భోగభాగ్యాలకు ఏ లోటూ లేదు. నాకు బ్రహ్మజ్ఞానము కావాలి. ఇస్తారా?'' అని అడిగాడు.

''ఇస్తాను'' అన్నారు నవ్వుతూ.

''అయితే త్వరగా యిప్పించండి. నేను అర్జంటుగా వెళ్ళాలి. ఆలస్యం చేస్తే వ్యాపారం ఆగిపోయి ధన నష్టం కలుగుతుంది'' అంటూ కంగారుపెట్టసాగాడు బాబాని రామశర్మ.

అప్పుడు బాబా ''చూడు నాయనా! నా చుట్టూ ప్రతి క్షణం ఇంతమంది జనం గుమిగూడి వుంటారు. ఇలా నా భక్తుల సమూహం వస్తూ పోతూ వుంటారు. కానీ ఏ ఒక్కరూ ఇంతవరకూ 'బ్రహ్మజ్ఞానము' కావాలని కోరలేదు. అందరూ ధనం, ఆస్తి, ఆరోగ్యం, ఇళ్ళూ వాకిళ్ళూ, మనశ్శాంతి మాత్రమే కోరుతున్నారు. నీలా బ్రహ్మజ్ఞానము కావాలని, అసలు అటువంటి జ్ఞానమొకటి ఉంటుందని వీరికి తెలియదు. కాబట్టే నా దగ్గర బ్రహ్మజ్ఞానము ఖజానా నిండి నేల పొర్లుతున్నది. నీకు కావల్సినంత పట్టుకుపొమ్మ'' అన్నారు ఆనందంగా.

చుట్టూ వున్న భక్తబృందం వారి సంభాషణలు అర్థంకాక ఆశ్చర్యంగా చూస్తున్నారు.

అప్పుడు బాబా అక్కడి భక్తులలో కృష్ణ అనే యువకుడిని పిలిచి, ''నాయనా కృష్ణా నీవు అర్జంటుగా నందుని ఇంటికి పోయి ఓ ఐదు

జి. రామలక్ష్మి, హైద్రాబాద్



రూపాయలు తీసుకురా, తిరిగి వెంటనే ఇచ్చివేసెదనని కూడా చెప్పి మరీ తీసుకురా'' అని చెప్పి పంపారు.

మరో పది నిమిషాల్లో కృష్ణ తిరిగి వచ్చి, ''బాబా! నందుడు లేడు. వాళ్ళింటికి తాళం వేసి వుంది!'' అన్నాడు.

''అలాగా! అయితే బాలాజీ దగ్గరకు వెళ్ళి తీసుకురా'' అన్నారు బాబా.

మరో పది నిమిషాల్లో కృష్ణ తిరిగివచ్చి, ''బాబా! బాలాజీ ఇంట్లో లేడు. అతని చిన్న కొడుకు మాత్రం ఉన్నాడు. అతన్ని అడిగితే నాన్న ఇప్పుడప్పుడే రాడు, పనిమీద బయటకు వెళ్ళాడు అని చెప్పాడు'' అన్నాడు.

''అయ్యో ఎలాగ? ఇప్పుడు ఐదు రూపాయలు అర్జంటుగా కావాలే నాకు'' అంటూ విచారపడి కృష్ణని మరో నలుగురింటికి పంపారు. లేరనో, వాళ్ళ దగ్గర డబ్బులు లేవనో అంటూ అన్నిచోట్లా తిరిగి వచ్చి బాబాతో చెప్పాడు కృష్ణ.

ఈ జరుగుతున్న భాగోతమంతా భక్తులతో పాటు రామశర్మా చూస్తూనే వున్నాడు. పైగా అతని మనసు కంగారుపడుతోంది. అతని జేబులో చాలా ధనం వుంది. కాని లోభి. అందువలనే తన దగ్గర అంత డబ్బు వున్నా పాపం బాబా ఐదు రూపాయల కోసం అంత ఆతృత పడుతున్నా, ఆ ఐదు రూపాయలూ బాబా తనకివ్వటానికే అలా పంపిస్తున్నారేమో అని ఆశపడసాగాడు. ఇదంతా చూసి ఇంక బాబాని, ''బాబా నేను వెళ్లాలి. చెప్పాను కదా, నేను క్షణం ఆలస్యం చేసినా ఎంతో నష్టపోయే వ్యాపారినని'' అంటూ కంగారుపెట్టసాగాడు.

అప్పుడు శ్రీ సాయిబాబా చిరునవ్వు నవ్వుతూ, ''నాయనా ఆ యువకుని బ్రహ్మము తెచ్చుటకే యింతవరకు పంపియుంటిని. కానీ ఇంటివద్ద ఎవరునూ లేరు. అయిననూ ఆ బ్రహ్మము ఇరువదిఐదు నోట్ల రూపమును గలిగి, నీవద్దనే వుంది. తీసి చూసుకొనుము'' అన్నారు.

అదివిని ఆ ధనికుడు అందులోని అర్థము, గూడార్థము గ్రహించి తన జేబునందలి పైకమును బయటకు తీసి లెక్కించగా ఐదు రూపాయల నోట్లు ఇరవై అయిదుండెను.

అతడులంతట సిగ్గుపడిపోయి తలదించుకొనెను. 'తనవద్ద ధనమున్నదని కరెక్టుగా బాబా చెప్పారు. వీళ్ళంతా తననేమనుకుంటారు? లోభి, పిసినారి, పాపం బాబా ఒక్క ఐదు రూపాయల గురించి అంతగా తపిస్తే, ప్రయత్నిస్తే ఆమాత్రం ఇవ్వలేకపోయాడా' అని చీదరించుకుని తనని అసహ్యించుకోరూ' అన్న ఆలోచనలతో అతని తల అవమానంతో నేలకు వంగిపోయెను.

అతనిలో కల్గిన పశ్చాత్తాప పరిణామం గ్రహించిన బాబా చిరునవ్వు నవ్వి, ''ఓయి వెర్రివాడా! బ్రహ్మజ్ఞానమంటే అంత సులువైనదని యెంచితివా? ధనమున్నచో పొందజాలనిది లేదని భావించితివి. కానీ, బ్రహ్మజ్ఞానము ధనము వలన లభ్యమగునది కాదు. ఐదు రూపాయల కొరకు నేనింతమంది వద్దకు తిప్పుతున్నప్పటికీ నీ వద్ద వుండి కూడా ఈయజాలకపోతివి. దానిని బట్టి చూడగా దానిపై నీకెంత మమకారము గలదో ఊహింపుము. బ్రహ్మజ్ఞానమన సర్వజగత్తనందు యిమిడియున్న శక్తియే బ్రహ్మమని, ఆ శక్తియే నీయందు, నా యందు, సర్వజీవరాసులందును, చేతనాచేతనములందు గలదను జ్ఞానము గల్గియుండుట. అద్దానిని పొందుటకు మనస్సును నిగ్రహించి, మంచిచెడులు, వివేకము, విచక్షణ కలిగి. యోగిపుంగవుల నాశ్రయించిన లభ్యము కాగలదుగానీ, అన్యము కాదు. అటులని అన్నీ విడిచి కాషాయాంబరము ధరించి అడవుల నివసింపనవసరమూ లేదు. నీ మనస్సే సర్వమునకు కారణముగాన, అట్టి మనస్సును ముందు నిలకడచేసి అంతర్ముఖుడవై 'నేను' అనగా నేమో ఎరింగి, అదే సర్వత్రా సర్వమునందు అఖండముగా గలదనెడీ జ్ఞానమును అనుభవపూర్వకముగా తెలుసుకొనుము'' అని ఎంతయో ప్రేమ, లాలనగా బోధించి చెప్పారు.

రామశర్మతోపాటు బాబా బోధనలను అక్కడున్న వారంతా తన్మయులై బాబా పాదాలపై పడి శరణువేడారు.

సమతాదృష్టిని మనం బాబా నుంచే నేర్చుకోవాలి.

